RNI: TELTEL12215

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక



WANTED

ప్రభాత సూర్యుడు

www.prabhathasuryudu.com

**రిపోర్టర్స్ కావలెను**

తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.

కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

prabhathasuryudueditor@gmail.com

https://youtube.com/@UstudioTV

94940 54338



RANGAREDDY | EDITION : 01 | VOLUME :150 | EDITOR: CHERUKU UPENDAR, | DATE : SUNDAY 15 OCTOBER 2023 | PAGES: 4 | RATE: Rs.5/-

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక : 150 | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | తేదీ : ఆదివారం 15 అక్టోబర్ 2023 | పేజీలు : 4 | వెల : 5/-


# నేడే కాంగ్రెస్ తొలి జాబితా



**- 58 నియోజకవర్గాల అభ్యర్థులు ఖరారు - 70 స్థానాలకు కసరత్తు పూర్తి**

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ మొదటి జాబితా ఈ నెల 15న ఆదివారం విడుదల కానుంది. తొలి జాబితాలో 58 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశముంది. మొత్తం 70 స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముగించినప్పటికీ%ా% ఇందులో 58 మంది అభ్యర్థులకు అధిష్టానం ఆమోద ముద్ర వేసినట్టు సమాచారం.కాగా, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో భాగంగా శుక్రవారం జీఆర్జీ రోడ్ 15 లోని 'వార్ రూం' లో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ నాలుగో సారి భేటి అయింది. మధ్యాహ్నం12 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 నిమిషాల వరకు దాదాపు రెండున్నర గంటల పాటు ఈ భేటి సాగింది. స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ మురళీధరన్ నేతృత్వంలో జరిగిన ఈ భేటిలో కమిటీ సభ్యులు బాబా సిద్ధిఖీ, జిగేష్ మెవానీ, కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మాణిక్ రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రచార కమిటీ

మిగతా 2లో



# డీఎస్సీ వాయిదా

## అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విద్యాశాఖ నిర్ణయం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. వచ్చేనెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఉంటుందని ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో అదేనెల 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో జరిగే రాతపరీక్షలను వాయిదా వేస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన


మిగతా 2లో

# చంద్రబాబు కోసం.. ఆస్పత్రిలో వీఐపీ గది

రాజమండ్రి- ప్రభాత సూర్యుడు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. రాజమండ్రి జైలులో చేరిన తర్వాత 5 కేజీలు తగ్గారని భార్య భువనేశ్వరి తెలిపారు. ఇటీవల డీహైడ్రేషన్, అలర్జీలతో బాధపడుతుండటతో కుటుంబసభ్యులు, టీడీపీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. జైలులో చంద్రబాబు ఆరోగ్యానికి ముప్పు ఉందని పలు అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో చంద్రబాబును ఆసుపత్రికి తరలించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గురువారం జీజీహెచ్ నుంచి ఇద్దరు చర్మ సంబంధిత వైద్య నిపుణులు ఆయన్ను

మిగతా 2లో



# కరీంనగర్ నుంచే ప్రచారం

కరీంనగర్- ప్రభాత సూర్యుడు

గులాబీ పార్టీకి కంచుకోటగా పేరుగాంచిన కరీంనగర్ జిల్లాపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి ఎన్నికల్లో సెంటిమెంట్ గా హుస్నాబాద్ నుండి ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీగా ఉండడంతో ఈ నెల 15 వ తేదీన హుస్నాబాద్ నుండి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. కరీం నగర్ జిల్లాపై సిఎం కేసీఆర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. 2014,2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక స్థానం మినహా 12 స్థానాలను టీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోగా, ఈ ఎన్నికల్లో కూడా అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవాలనే ఆలోచనతో

మిగతా 2లో



# ప్రవళ్లిక ఆత్మహత్య బాధాకరం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్ లో గ్రూప్-2 అభ్యర్థిని ప్రవళిక ఆత్మహత్యపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పందించారు. ఆమె ఆత్మహత్య బాధాకరమని, ఏ తల్లిదండ్రులకు ఇలాంటి పరిస్థితి రాకూడదని అన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ విమర్శలపై కవిత తీవ్రంగా స్పందించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆవేదన బూటకమని, కాంగ్రెస్ పార్టీ ఆందోళన నాటకం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్విట్టర్ వేదికగా రేవంత్ రెడ్డి చేసిన విమర్శలను కవిత తిప్పికొట్టారు.ఈ సందర్భంగా బతుకమ్మ సంబరాలపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను కవిత తీవ్రంగా ఖండించారు. 'మేము బతుకమ్మ చేస్తాం.. బాధను కూడా పంచుకుంటాం.' అని అన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను కించపరచడం ఒక కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమని ధ్వజమెత్తారు. ఓ ఆడబిడ్డ ఆత్మహత్య చేసుకుంటే సానుభూతి వ్యక్తం చేయడం పోయి రాజకీయం చేయడమే కాంగ్రెస్ విధానమా.? అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. ఉద్యోగ నోటిఫికేషన్లకు మోకాలడ్డుతూ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నది కాంగ్రెస్ పార్టీ కాదా.? అని ఆమె నిలదీశారు. తెలంగాణలో ఏ ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ జారీ అయినా దాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేసింది వాస్తవం కాదా.? అని పేర్కొన్నారు. గ్రూప్ - 2 వాయిదా వేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీధర్ బాబు అసెంబ్లీలో డిమాండ్ చేశారని, రేవంత్ రెడ్డి సైతం ట్విట్టర్ (ఛీ) వేదికగా డిమాండ్ కోరారని గుర్తు చేశారు.ప్రవళిక ఆత్మహత్యపై

మిగతా 2లో



# 48 గంటల్లో నివేదిక ఇవ్వండి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు


హైదరాబాద్ లో గ్రూప్ - 2 అభ్యర్థిని ప్రవళిక ఆత్మహత్యపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పందించారు. ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై 48 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర సీఎస్, డీజీపీ, ఝాఖూఅ కార్యదర్శిని ఆదేశించారు. నిరుద్యోగులు సహనం కోల్పోవద్దని తమిళిసై కోరారు.వరంగల్ జిల్లా బిక్కాజిపల్లికి చెందిన మర్రి ప్రవళిక (23) అశోక్ నగర్ లోని ఓ హాస్టల్ లో ఉంటూ గ్రూప్ - 2 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. శుక్రవారం సాయంత్రం ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తోటి విద్యార్థుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న వందలాది నిరుద్యోగ అభ్యర్థులు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. గ్రూప్ - 2 పరీక్ష వాయిదా పడడం వల్లే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపిస్తూ నిరసనలు తెలిపారు. వారికి బీజేపీ నేతలు సైతం మద్దతు తెలిపారు. ఈ క్రమంలో ఉద్రిక్తత నెలకొంది. ఎట్టకేలకు అర్ధరాత్రి తర్వాత

మిగతా 2లో

## భారతదేశ మిస్సైల్ మ్యాన్

# మన భారతరత్న అబ్దుల్ కలాం

**నేడు ఆయన జయంతి**



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఈయన పూర్తి పేరు.. డాక్టర్ అవుల్ ఫకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలామ్. ఈయన 1931, అక్టోబర్ 15వ తేదీన తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు అషియమ్మ జైనులాబ్దీన్, జైనులాబ్దీన్ మరకయార్. ఓ మధ్యతరగతి ముస్లిం కుటుంబంలో పుట్టిన ఆయన 1958లో మద్రాస్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ ఎం) నుంచి ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పుచ్చుకున్నారు. పట్టభద్రుడైన తర్వాత ఆయన భారతదేశపు రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఒ)లో ఒక విఫలమైన హోవర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు మీద పనిచేయడానికి చేరారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరారు. అక్కడ ఆయన ఇతర శాస్త్రవేత్తలతో కలిసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై

మిగతా 2లో

# కరీంనగర్ నుంచే ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

అధి నాయకుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆరు చోట్ల బహిరంగసభల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారుతెలంగాణా ఉద్యమానికి గుండెకాయగా నిలిచి బీఆర్ఎస్ పార్టీని అక్కున చేర్చుకున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటే ముఖ్యమంత్రి కేసీఆర్ కు మక్కువ ఎక్కువ. గత ఎన్నికల్లో హుస్నాబాద్ నుండి ప్రచారం ప్రారంభించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి ఈ ఎన్నికల్లో ఇక్కడినుండే ప్రచారం ప్రారంభించనున్నారు.ఈ నెల 15వ తేదీన పార్టీ అభ్యర్థులకు ప్రగతిభవన్ లో బీ ఫారాలు అందచేసిన అనంతరం హుస్నాబాద్ చేరుకుని బహిరంగసభలో పాల్గొననున్నారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి కెప్టేన్ లక్ష్మీకాంతరావును రాజకీయ గురువుగా వేదికను ఎక్కించి, ఆయన ఆశీర్వాదం తీసుకుని రంగంలోకి దిగడం సెంట్ మెంట్ గా కేసీఆర్ భావిస్తారు.. కెప్టెన్ లక్ష్మీకాంతరావు కుమారుడు సతీష్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నుండే ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో కూడా అదేరోజు హుస్నాబాద్ వేదికగా విడుదల చేసే అవకాశం ఉంది.కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ స్కీములతో ముందుకు రాగా, బీజేపీ ఇస్తున్న హమీలను దృష్టిలో పెట్టుకుని ఇతర పార్టీల హమీలకు ధీటుగా మేనిఫెస్టో రూపకల్పన చేసినట్టు అధినాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.క్కో నియోజకవర్గానికి ఒక్కో సీనియర్ నేతను ప్రత్యేకంగా కేటాయించి..అక్కడ జరుగుతున్న ప్రచారాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని,ఇతర పార్టీల నాయకుల ప్రచారాలు,ఎత్తుగడలకు ధీటుగా బీఆర్ఎస్ అభ్యర్థులకు దిశానిర్ధేశం చేయాలని సూచించినట్టు తెలుస్తోంది.టిక్కెట్ కోసం ఇంకా ప్రయత్నాలు మానుకోవాలని ఆశావహులను హెచ్చరిస్తు,వారు పార్టీ వీడకుండా బుజ్జగింపు ప్రయత్నాలు కొనసాగించడానికి ఉమ్మడి జిల్లాలోని సీనియర్ నాయకులను రంగంలోకి దించారు. ఏ ఒక్క కార్యకర్త కూడా పార్టీని వీడకుండా,ఇతర పార్టీలోని నాయకులు, కార్యకర్తలు తమ పార్టీలోకి రావడానికి సన్నాహాలు జరుగుతున్నాయిఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీజేపీ,కాంగ్రెస్ పార్టీలు బలపడ్డాయన్న సర్వేల నివేదికలతో గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో గట్టి పోటీ ఉండబోతోందని పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ తన కార్యాచరణను ప్రకటించడంతో పాటు ,ప్రతిపక్షాల నుండి గట్టి సవాళు ఎదురవుతున్న నేపథ్యంలో ధీటైన జవాబునిచ్చే దిశగా బీఆర్ఎస్ పార్టీ కసరత్తు చేస్తోంది.కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల మద్దతును కూడగట్టుకునేందుకు చేపడుతున్న ప్రయత్నాలను తిప్పి కొట్టేందుకు, ఉమ్మడి జిల్లాల్లో ఆరు చోట్ల భారీ బహిరంగ సభలకు శ్రీకారం చుట్టనున్నారు. మూడవసారి అధికారమే లక్ష్యంగా15 న హుస్నాబాద్ లో, 17న సిరిసిల్ల,మంథని,పెద్దపల్లిలో బహిరంగసభలు ఏర్పాటు చేయనున్నారు.నవంబర్ 2 న ధర్మపురి, 3న కోరుట్లలో భారీ బహిరంగసభలు ఏర్పాటు చేయనున్నారు. కేసీఆర్ పాల్గొనే బహిరంగసభలను విజయవంతం చేయడానికి ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నేతలంతా కసరత్తు ప్రారంభించారు. ఏ నియోజక వర్గంలోనైనా సభ ఏర్పాటు చేస్తే సుమారు యాభై వేల నుండి లక్ష మంది వరకు ప్రజలు తరలివచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు అందినట్టు తెలుస్తోంది.ఎన్నికల ప్రక్రియ దగ్గరయ్యే కొద్ది, ఏ నియోజకవర్గంలో ఏ అభ్యర్థి బలహీనంగా ఉన్నాడో ఆలోచించి ,ఆయా నియోజకవర్గాల్లో మరోసారి సభలు ఉండే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# చంద్రబాబు కోసం.. ఆస్పత్రిలో వీఐపీ గది

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షించి కొన్ని మందులు సూచించారు. దీంతో సీల్డ్ కవర్‌లో సమగ్ర నివేదిక జైలు ఉన్నతాధికారులకు ఇచ్చినట్లు వైద్యవర్గాలు తెలిపాయి.రాజమండ్రి జీజీహెచ్‌లో ఉన్న వీఐపీ చికిత్స గదిని అధికారులు అత్యవసరంగా రెడీ చేయించారు. క్యాజువాలిటీ పక్కనున్న ఆ గది, మార్గం అంతా హడావుడిగా అర్ధరాత్రి క్లీన్ చేశారు. ఒకవేళ వైద్యుల సూచనలతో ఆయన్ను ఆసుపత్రికి తరలించాల్సి వస్తే, ముందు జాగ్రత్త చర్యగా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ తో పాటు ఇద్దరు క్యాజువాలిటీ డాక్టర్లు, మరో ఇద్దరు స్టాఫ్ నర్సులను విఐపీ గదికి కేటాయించారు. వారంతా శుక్రవారం అర్ధరాత్రి నుంచే సిద్ధంగా ఉన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. విఐపీ గదిలో రెండు ఆక్సిజన్ బెడ్లు, ఒక ఈసీజీ మిషన్, వెంటిలేటర్, వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉంచారు. ప్రభుత్వాసుపత్రిలో వీఐపీ గదిని ఆగమేఘాలపై సిద్ధం చేయడం చర్చనీయాంశంగా మారింది. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిని ముగ్గురు వైద్యులు పర్యవేక్షిస్తున్నారని కోస్తాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ తెలిపారు. తొలి నుంచీ వాడుతున్న మందులే వినియోగిస్తున్నారన్న ఆయన, రోజుకు మూడుసార్లు వైద్య పరీక్షలు చేస్తున్నామని వెల్లడించారు. ఇటీవల డీహైడ్రేషన్‌కు గురైనట్లు చంద్రబాబు చెప్పడంతో వైద్యుల సూచన మేరకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందజేశామన్నారు. శరీరంపై దద్దుర్లు వచ్చినట్లు తెలపడంతో జీజీహెచ్ నుంచి ఇద్దరు వైద్య నిపుణులను పిలిపించి పరీక్షలు చేయించామన్నారు. వారు సూచించిన లోషన్లు, క్రీమ్‌లు అందజేశామని, చంద్రబాబు ఆరోగ్యం, భద్రతపై ఆందోళన వద్దని సూచించారు.ఆరోగ్య పరీక్షలకు వ్యక్తిగత వైద్యులను అనుమతించే పరిస్థితి లేదని రవికిరణ్ స్పష్టం చేశారు. ఏమైనా సమస్య వస్తే వైద్యుల సూచన మేరకు ఆసుపత్రికి తరలిస్తామన్న ఆయన, జైలు నిబంధనల మేరకు ఏసీ సమకూర్చే అవకాశం లేదని, నిత్యం 8 ఫ్యాన్లు తిరుగుతున్నాయని డీఐజీ వెల్లడించారు. కలుషిత జలాల వల్లే చంద్రబాబుకు చర్మ సమస్య వచ్చిందన్న టీడీపీ ఆరోపణలను కొట్టిపారేశారు. అలాగైతే ఖైదీలందరికీ సమస్య వస్తుంది కదా అన్నారు. చంద్రబాబు కారాగారం లోపలకు వెళ్తున్న ఫొటోలు బయటకు రావడంపై విచారణ చేపడుతున్నామని వెల్లడించారు. ఓపెన్ ఎయిర్ జైల్ ప్రాంగణంలోకి డ్రోన్ వచ్చినట్లు గుర్తించామన్నారు. దీనిపై విచారణ జరిపినా ఎలాంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేశారు.

## భారతదేశ మిస్సైల్ మ్యాన్
# మన భారతరత్న అబ్దుల్ కలాం

(మొదటి పేజీ తరువాయి)

1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారత దేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (ఎస్ఎల్వీ-ఎఎ)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు "మిస్సైల్ మాన్" అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-ఎఎ అణు పరీక్షలు విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఈయనకు భారతదేశ అత్యున్నత పురస్కారాలైన పద్మ భూషణ్ (1981), పద్మ విభూషణ్ (1990), భారతరత్న (1997)లు వరించాయి. అలాగే, దేశంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో కనీసం 30వరకు యూనివర్శిటీలు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగుపెట్టారు.

ఈయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాంపై వామపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా 87-ఏళ్ళ లక్ష్మీ సెహగల్ పోటీ చేశారు. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. ఖచ్చితమైన వ్యక్తిగత క్రమశిక్షణను పాటిస్తారు. "ప్రజలు.. తమ భార్యాపిల్లలకు తమ పిల్లల పిల్లలకూ ఆస్తులు సంపాదించి పెట్టడం కోసమే అవినీతిపరులౌతారు" అంటూ ఆయన బ్రహ్మచర్యాన్ని స్వీకరించారు. ఇస్లాం ప్రకారమైతే ప్రతి ముస్లిమూ పెళ్ళి చేసుకోవాలి. కానీ, కలాం ఖురాన్‌తో పాటు, భగవద్గీతను కూడా చదువుతారు. మతఘర్షణలను నిరసించే శాంతి కాముకుడిగా పేరుగడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. రాష్ట్రపతిగా కూడా సేవలందించిన మహనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం జూలై 27, 2015 సోమవారం సాయంత్రం హఠాన్మరణానికి గురయ్యారు. షిల్లాంగ్‌లోని ఐఐఎంలో సోమవారం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం హఠాత్తుగా ప్రసంగం మధ్యలో కుప్పకూలిపోయారు. గుండెపోటుతో కుప్పకూలిన అబ్దుల్ కలాంను స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో ఉంచి చికిత్స అందించే ప్రయత్నం చేశారు.

## ప్రవల్లిక
# ఆత్మహత్య బాధాకరం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి ఆవేదన బూటకమని, కాంగ్రెస్ ఆందోళన నాటకమని ఎమ్మెల్సీ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శవాల మీద పేలాలు ఏరుకోవడం కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి హత్య చేసిన వారే ఓదారుస్తున్నట్లుందని ధ్వజమెత్తారు. అంతకు ముందు ప్రవళిక ఆత్మహత్యపై తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, 'బతుకమ్మ సంబరాలపై వీడియోలు పెట్టే ఓఒఅ కవితకు, గ్రూప్ - 2 పరీక్షల నిర్వహణ అవకతవకలతో బతుకు భారమై, భవిత ఆగమై ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక ఆత్మ ఘోష వినపడడం లేదా.?' అంటూ ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'ఆడబిడ్డల హక్కులు మీ దృష్టిలో రాజకీయ అంగడి సరుకు, రాజకీయ నినాదాలు తప్ప మానవీయ ఎజెండాలు కాదు' అని ట్వీట్ లో ధ్వజమెత్తారు. వరంగల్ జిల్లా బిక్కాజిపల్లికి చెందిన మర్రి ప్రవళిక (23) అశోక్ నగర్‌లోని ఓ హాస్టల్ లో ఉంటూ గ్రూప్ - 2కు సన్నద్ధమవుతోంది. శుక్రవారం సాయంత్రం ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, గ్రూప్-2 పరీక్ష వాయిదాతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపిస్తూ వందలాది మంది నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ అంశంపై రాజకీయంగానూ వివాదం రేగుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటూ కాంగ్రెస్, బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు.

# నేడే కాంగ్రెస్ తొలి జాబితా

(మొదటి పేజీ తరువాయి)

చైర్మెన్ మధు యాష్కీ, ఏఐసీసీ సెక్రటరీలు పీసీ విష్ణునాథ్, మన్సూర్ అలీఖాన్, రోహిత్ చౌదరి, కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు పాల్గొన్నారు. ఈ భేటిలో ప్రధానంగా 119 స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై చర్చ జరిగినట్టు తెలిసింది. సీనియర్ నేతలు బరిలో ఉన్న స్థానాలు, ఒక అసెంబ్లీకి ఒకరు లేదా ఇద్దరు పోటీ పడుతోన్న స్థానాలు, ఎలాంటి వివాదాలు లేని దాదాపు 40 నుంచి 60 స్థానాలపై మొదటి రెండు సమావేశాల్లో కమిటీకి స్పష్టత వచ్చింది. మూడో సమావేశంలో వివాదాలు, ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు పోటీలో ఉన్న నియోజక వర్గాలపై కమిటీ ఫోకస్ పెట్టింది. అయితే ఈ చర్చలో కమిటీలో ఉన్న రాష్ట్ర నేతలు తాము సూచించిన వారికే సీటు ఇవ్వాలన్న అభిప్రాయాలను వెల్లడించడంతో ఈ భేటి అసంతృప్తిగా ముగిసింది. ఇలాంటి దాదాపు 6 నుంచి 8 స్థానాల్లో అభ్యర్థుల ఎంపికను కమిటీ చైర్మెన్ ప్యానల్ కమిటీకి (సోనియా, రాహుల్) సిఫారసు చేసినట్టు తెలిసింది.

### అభ్యర్థుల ఎంపికపై సీఈసీ భేటి

తెలంగాణ అభ్యర్థుల ఎంపికపై శుక్రవారం తొలిసారి కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ (సీఈసీ) భేటి అయింది. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ భేటిలో తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్ అభ్యర్థుల ఎంపికపై సీఈసీ చర్చించింది. అక్బర్ రోడ్‌లోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జరిగిన ఈ భేటిలో అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ మురళీధరన్, రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే, టీపీసీసీ రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, మధు యాష్కీ, సీఈసీలోని ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. మురళీధరన్ ఆధ్వర్యంలోని స్క్రీనింగ్ కమిటీ ఇచ్చిన అభ్యర్థుల జాబితాపై ఈ భేటిలో సుదీర్ఘంగా చర్చించారు. ఉదరు పూర్ డిక్లరేషన్, సామాజిక వర్గాల విజ్ఞప్తులు, ఓయూ విద్యార్థుల డిమాండ్ల నేపథ్యంలో పలు అసెంబ్లీ నియోజక వర్గాల్లో అభ్యర్థుల ఎంపిక, స్థానిక అంశాలపై మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఆరా తీసినట్టు తెలిసింది. అయితే విడుదలకు సిద్ధంగా ఉన్న దాదాపు 70 స్థానాలతో కూడిన ఫస్ట్ లిస్ట్‌లో అలాంటి వివాదస్పద సీట్లు లేవని, గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న స్థానాలే ఉన్నాయని రాష్ట్ర నేతలు వివరించినట్టు విశ్వసనీయ సమాచారం.

### 70 సీట్లతో లిస్ట్ రెడీగా ఉంది

70 అసెంబ్లీ సీట్లలో అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నట్టు స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ మురళీధరన్ పేర్కొన్నారు. గెలుపు, ఓటములు, పార్టీ విధేయత ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్టు ప్రకటించారు. కమ్యూనిస్టు పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని, వారికి కేటాయించే సీట్లపై స్పష్టత రాగానే ఒకేసారి జాబితా ప్రకటిస్తామని చెప్పారు. సీఈసీ భేటి తర్వాత మురళీధరన్ మీడియాతో మాట్లాడారు. శుక్రవారం జరిగిన సీఈసీ భేటిలో భేటిలో కేవలం 70 స్థానాలపై చర్చ జరిగిందన్నారు. మరోసారి సీఈసీ భేటి కానుందని చెప్పారు. ఉదరు పూర్ డిక్లరేషన్ ప్రకారమే అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. మైనార్టీ, మహిళలు, బీసీలు, ఇతర సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించబోతున్నట్లు చెప్పారు. అయితే ఎవరి రాజీనామాలపై స్పందించాల్సిన అవసరం లేదని పొన్నాల రాజీనామాను ఉద్దేశించి విమర్శలు చేశారు. రాజీనామాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, పార్టీలో చాలా మంది వచ్చి చేరుతున్నారని బదులిచ్చారు.

### వివాదస్పద సీట్లపై నిర్ణయం అధిష్టానిదే

స్క్రీనింగ్ కమిటీలో స్పష్టత రాని వివాదస్పద సీట్లపై నిర్ణయం పార్టీ అధిష్టానిదే అని కమిటీ సభ్యులు, ఎంపీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. స్క్రీనింగ్ కమిటీ భేటి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దాదాపు 119 స్థానాల్లో అభ్యర్థుల పై చర్చ జరిగిందన్నారు. అన్ని సీట్లపై కసరత్తు పూర్తి అయిందన్నారు. స్పష్టత రాని కొన్ని స్థానాలను ప్యానెల్ కి పంపించినట్లు చెప్పారు. వీటిపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు నిర్ణయం తీసుకుంటారన్నారు.

# 48 గంటల్లో నివేదిక ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు మృతదేహాన్ని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు.పోస్టుమార్టం పూర్తైన అనంతరం ప్రవళిక మృతదేహాన్ని అక్కడి నుంచి శనివారం ఉదయం ఆమె స్వగ్రామానికి తరలించారు. ప్రవళిక మృతితో ఆమె స్వగ్రామం బిక్కాజిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

# డీఎస్సీ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే డీఎస్సీ రాతపరీక్షల నిర్వహణ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు. డీఎస్సీ రాతపరీక్షలు వాయిదా పడినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే ప్రక్రియ యథాతథంగా కొనసాగుతుందని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. వాటి సమర్పణకు ఈనెల 21 వరకు తుదిగడువు ఉందని తెలిపారు. ఇప్పటి వరకు 80 వేల దరఖాస్తులు వచ్చినట్టు వివరించారు. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సెప్టెంబర్ ఎనిమిదో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. గతనెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చేనెల 20,21 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టులకు, అదేనెల 22న స్కూల్ అసిస్టెంట్ అన్ని లాంగ్వేజ్ సబ్జెక్టులకు, 23న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) అభ్యర్థులకు, 24న లాంగ్వేజ్ పండితులకు, 25 నుంచి 30 వరకు ఆరు రోజులపాటు సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) అభ్యర్థులకు రాతపరీక్షలను నిర్వహించాలని విద్యాశాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నికల పోలింగ్ వచ్చేనెల 30న ఉండడంతో డీఎస్సీ రాతపరీక్షలు అనివార్యంగా వాయిదా పడ్డాయి. ఎన్నికల నేపథ్యంలో వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో జరగాల్సిన గ్రూప్-2 రాతపరీక్షలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వాయిదా వేసిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరి ఆరు, ఏడు తేదీల్లో తిరిగి నిర్వహిస్తామని ప్రకటించింది.

# బొల్లారంలో అగ్ని ప్రమాదం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని అమర్‌ల్యాబ్ రసాయన పరిశ్రమలో శనివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. రెండు రియాక్టర్‌లు పేలిన ఘటనలో అక్కడ విధులు నిర్వహిస్తున్న 11 మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది 3 ఫైరింజన్ల సాయంతో మంటలు అదుపులోకి తెచ్చారు. క్షతగాత్రులను రెస్క్యూ సిబ్బంది బాచుపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా రియాక్టర్లు పెద్ద శబ్ధంతో పేలినట్లు కార్మికులు తెలిపారు. ప్రమాదం తర్వాత చుట్టుపక్కల ఓ కి.మీ వరకూ దట్టమైన పొగలు అలుముకోవడంతో అంతా ఆందోళన చెందారు. కాగా, అమర్ ల్యాబ్ పరిశ్రమలో గతంలోనూ ఇలాంటి ప్రమాదమే జరిగిందని స్థానికులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రస్తుత ప్రమాదంపై పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో హైదరాబాద్ మెహిదీపట్నంలోని ఓ అపార్టుమెంట్ లోనూ అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంపీరియల్ ప్లాజాలోని రెండో అంతస్తులో మంటలు చెలరేగగా నివాస గృహం పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు. భవనంలో భారీగా మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అపార్ట్ మెంట్ ను మరోసారి తనిఖీ చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. కాగా, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం కాలేదని వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ హౌరాలోనూ శనివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఇండస్ట్రియల్ పార్కులోని వేర్ హౌజ్ లో అగ్ని ప్రమాదం జరగ్గా, మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడి పొగలు దట్టంగా అలుముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 11 ఫైరింజన్ల సాయంతో మంటలు అదుపులోకి తెచ్చేందుకు యత్నిస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై స్పష్టత లేదు. నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియలేదని అధికారులు తెలిపారు.

## సంపాదకీయం

### ఇజ్రాయెల్-హమాస్ మధ్య


# ముదురుతున్న వివాదం

ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం మొదలైపోయింది. రానున్న రోజుల్లో ఈ వార్ మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి. మొదటి బ్యాచ్ 212 మంది పౌరులు శుక్రవారం ఉదయం చార్టర్డ్ విమానం ద్వారా భారతదేశానికి చేరుకున్నారన్న సంగతి తెలిసిందే. ఇజ్రాయిల్ నుండి భారతీయ పౌరులు తిరిగి రావడానికి మొదటి విమానం గురువారం సాయంత్రం 212 మందితో బెన్ గురియన్ విమానాశ్రయం నుండి బయలుదేరి శుక్రవారం ఉదయం ఢిల్లీకి చేరుకుంది. ఇలా స్వదేశానికి తిరిగి వస్తున్న భారతీయులకు సంబంధించిన ఖర్చులను భారత ప్రభుత్వం భరిస్తుంది. ఇజ్రాయిల్‌లో ప్రస్తుతం 18,000 మంది భారతీయులు నివసిస్తున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి తెలిపారు. గత శనివారం ఉదయం హమాస్ అకస్మాత్తుగా ఇజ్రాయిల్‌పై దాడి చేసి బీభత్సం సృష్టించింది. హమాస్ యోధులు ఇజ్రాయిల్‌పై 5000కు పైగా రాకెట్లను ప్రయోగించారు. ఈ దాడిలో 1300 మందికి పైగా ఇజ్రాయిల్ ప్రజలు మరణించగా వేలాది మంది గాయపడ్డారు. ఈ దాడి తరువాత ఇజ్రాయిల్ కూడా ప్రతీకారం తీర్చుకుంటూనే ఉంది. ఇందులో వందలాది మంది హమాస్ ప్రజలు మరణించారు. వేలాది మంది ప్రజలు గాయపడ్డారు. గత ఏడు రోజులుగా ఈ రెండు దేశాల మధ్య యుద్ధం నడుస్తోంది. హమాస్‌పై ఇజ్రాయిల్ నిరంతరం దాడులు చేస్తోంది. దాదాపు 3 లక్షల మంది ఇజ్రాయిల్ సైనికులు గాజా స్ట్రిప్‌లో మోహరించారు. యుద్ధం తీవ్రమైతే ఇజ్రాయెల్‌లోని ప్రపంచ కంపెనీలు అక్కడ తమ వ్యాపారాన్ని ముగించే అవకాశాలు ఉంటాయి. అయితే యుద్ధం ముదిరితే కంపెనీలు ముఖ్యంగా టెక్నాలజీ రంగంలో ఉన్న కంపెనీలు భారతదేశం, తూర్పు యూరప్‌లోని దేశాల వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయని ఓ ఆంగ్ల పత్రిక ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రతిభ ఉన్న ప్రాంతాలకు ఈ వ్యాపారాలు మారుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇజ్రాయెల్‌లో 500 గ్లోబల్ కంపెనీలు ఉన్నాయి. ఇందులో మైక్రోసాఫ్ట్, ఇంటెల్, గూగుల్ వంటి ప్రముఖ కంపెనీలు ఉన్నాయి. భారతీయ కంపెనీలు విప్రో, టీసీఎస్ సంస్థలు కూడా ఇజ్రాయెల్‌లో వ్యాపారాన్ని కలిగి ఉన్నాయి. ఇజ్రాయెల్‌లోని ఈ కంపెనీలలో దాదాపు 100,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇజ్రాయెల్‌లో హైటెక్ పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగం. ఈ ప్రాంతం యుద్ధం ద్వారా ప్రభావితమవుతుంది. గాజా స్ట్రిప్‌లోకి ప్రవేశించేందుకు ఇజ్రాయెల్ సైన్యం సిద్ధమైంది. ఇదే జరిగితే పెద్ద యుద్ధమే మొదలవుతుంది. చిప్‌మేకర్ ఇంటెల్ ఇజ్రాయెల్ లో అతిపెద్ద ప్రైవేట్ కంపెనీ. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి మాట్లాడుతూ.. వారు ఇజ్రాయెల్‌లో పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారు. సిబ్బంది భద్రత కోసం చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. హమాస్ ఉగ్రవాదులు శనివారం దక్షిణ ఇజ్రాయెల్ పై విరుచుకుపడ్డారు. ఇందులో 1000 మందికి పైగా ఇజ్రాయెల్ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. చాలామంది హమాస్ చేతిలో బందీలుగా ఉన్నారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో ఎంతో మంది చనిపోతున్నారు. తాజా నివేదికల ప్రకారం, ఇప్పటి వరకు రెండు దేశాల వైపులా సుమారు 2,300 మంది మరణించారని తెలుస్తోంది. లక్షలాది మంది ప్రజలు నిర్వాసితులయ్యారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అర్ధరాత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ సమయంలో హమాస్‌ను మూలాల నుంచి తరిమికొట్టాలని అతను తన సంకల్పాన్ని వ్యక్తం చేశాడు. మా కుమారులు, కుమార్తెల తుపాకులతో ఎక్కుపెట్టి కాల్చారు. స్త్రీ, పురుషులను సజీవ దహనం చేశారు. యువతులపై అత్యాచారం చేసి చంపేశారు. సైనికుల శిరచ్ఛేదం జరిగింది అని నెతన్యాహు అన్నారు. ఇక ఇజ్రాయెల్ ? హమాస్ యుద్ధం కారణంగా ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులను సురక్షితంగా మన దేశానికి రప్పించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. భారత ప్రభుత్వం ఇప్పటికే చాలా మందిని భారత్‌కు సురక్షితంగా విమానంలో రప్పించారు. ఇంకా అక్కడ మిగిలిన వారిని కూడా సురక్షితంగా భారత దేశానికి రప్పించే ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# కుత్బుల్లాపూర్ ఎవరిది

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయింది. అయితే హైదరాబాద్ నగరంలో ఉన్న నియోజకవర్గాల్లో అధికార బీఆర్ఎస్ కు కొంత అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా అభివృద్ధి పనులు శరవేగంగా జరగడం కారణంగా నగరంలోని ఎక్కువ ప్రాంతాల్లో బీఆర్ఎస్ జెండా ఎగిరే అవకాశముందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించే అవకాశాలున్నాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి. పారిశ్రామికంగా, రియల్ ఎస్టేట్ పరంగా ఈ ప్రాంతంలోని బాచుపల్లి, కుత్బుల్లాపూర్ మండలాలు అభివృద్ధి చెందడం కూడా కారు పార్టీకి కలసి వచ్చే అంశంగా చూస్తున్నారు. హ్యాట్రిక్ విజయం కోసం... 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఏర్పడింది. నియోజకవర్గం ఏర్పడిన తొలి ఎన్నికలు అంటే 2009లో ఇక్కడ స్వతంత్ర అభ్యర్థి శ్రీశైలం గౌడ్ గెలిచారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన వివేకానంద ఇక్కడి నుంచి తొలిసారి విజయం సాధించారు. ఆయన తర్వాత బీఆర్ఎస్ లో చేరి 2018 ఎన్నికల్లోనూ తన సత్తా చాటారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంలోకి ఈ ప్రాంతం వస్తుంది. ఎక్కువగా అన్ని ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ నివసిస్తుంటారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోకి ఈ నియోజకవర్గం వస్తుంది. ప్రధానంగా ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ల నిర్మాణం, రహదారుల పనులు పూర్తి చేయడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడం, తాగునీటి సౌకర్యం మెరుగుపర్చడంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద చాలా వరకూ సక్సెస్ అయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలు కారణంగా నిధులు తీసుకు వచ్చి అభివృద్ధిని వేగవంతంగా చేశారు. దీంతో మరోసారి తన గెలుపు నల్లేరు మీద నడకేనని ఆయన భావిస్తున్నారు. మరోసారి కూడా ఆయనకే గులాబీ బాస్ టిక్కెట్ కేటాయిచడంతో గత కొన్ని రోజుల నుంచి ఇంటింటి ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. అయితే రియల్ ఎస్టేట్ పరంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందినప్పటికీ కాంగ్రెస్, బీజేపీలు కూడా బలంగా ఉండటంతో గెలుపు ధీమా ఉన్నా వివేకానంద శ్రమించక తప్పదు. దీనికి తోడు ఎమ్మెల్సీ శంభీర్‌పూర్ రాజుతో విభేదాలు కూడా సమసిపోయాయి. ఈయన ఈసారి కుత్బుల్లాపూర్ టిక్కెట్ కోసం ప్రయత్నించారు. కానీ చివరకు వివేకానందకే టిక్కెట్ దక్కింది. శంభీర్‌పూర్ రాజును పార్టీ హైకమాండ్ సముదాయించడంతో ఆయన వివేకానందకు మద్దతుగా నిలిచేందుకు అంగీకరించారు. దీంతో కుత్బుల్లాపూర్ లోని గులాబీ పార్టీలో గ్రూపు విభేదాలు సమసి పోయినట్లే. దీంతో హ్యాట్రిక్ విజయం తనదేనన్న నమ్మకంతో వివేకానంద ఉన్నారు. తాను చేసిన అభివృద్ధి పనులతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు తనను ఒడ్డున పడేస్తాయన్న విశ్వాసంతో ఉన్నారు. బలమైన క్యాడర్ కూడా ఉండటం అదనపు బలం.

# అదిలాబాద్ లో త్రిముఖ పోటీలో ...




**అదిలాబాద్- ప్రభాత సూర్యుడు:** కొమరంభీం జిల్లాను అక్టోబరు 11, 2016న ఏర్పాటు చేశారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన గిరిజన ఉద్యమకారుడు కొమురం భీం పేరును ఈ జిల్లాకు పెట్లారు. ఈ జిల్లా పరిపాలన కేంద్రం ఆసిఫాబాద్. కొమరంభీం జిల్లాలో రెండే నియోజకవర్గాలు ఉన్నాయి. అవి ఒకటి ఆసిఫాబాద్, రెండు సిర్పూర్. 2014లో ఆసిఫాబాద్‌లో టీఆర్ఎస్ గెలవగా... 2018లో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి అత్రం సక్కు గెలిచారు. అలాగే.. 2014 ఎన్నికల్లో సిర్పూరులో బీఎస్పీ గెలవగా.. 2018లో మాత్రం బీఆర్ఎస్ విజయం సాధించింది. అసిఫాబాద్ నియోజకవర్గం ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం. ఈ నియోజకవర్గం అదివాసీ పోరాట యోధుడు కోమురంభీం పుట్టిన పోరుగడ్డ. ఇక్కడి నుండి జల్, జంగల్, జమీన్ యుద్ధం సాగించారు. ఈ నియోజకవర్గంలో 11 మండలాలు ఉన్నాయి. 2,06,709మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో అదివాసీలు, లంబడాలు, బీసీలు, ఎస్సీ ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో అదివాసీల ఓట్లే... ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేస్తాయి. ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా అత్రం సక్కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2018 ఎన్నికల్లో 171 ఓట్ల తేడాతో బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మిపై కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యే సక్కు విజయం సాధించారు. ఆ తర్వాత మారిన సమీకరణాలతో అత్రం సక్కు కాంగ్రెస్ పార్టీని వీడీ బీఆర్ఎస్‌లో చేరారు. కానీ పార్టీ నిర్వహించిన సర్వేలో ఆత్రం సక్కుపై పాజిటివ్ టాక్ రాకపోవడంతో.. ఈసారి ఎన్నికలకు కోవలక్ష్మికి టికెట్ ఇచ్చేసింది బీఆర్ఎస్. ఎమ్మెల్యేపై నియోజకవర్గ ప్రజల్లో వ్యతిరేకత ఉండటం.. తమకు కలిసివస్తాయని ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు భావిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటును తమకు అనుకూలంగా మలుచుకోవాలని చూస్తున్నాయి. అయితే బీఆర్ఎస్ కోవలక్ష్మికి టికెట్ ఇవ్వడంతో కాంగ్రెస్, బీజేపీకి గట్టి పోటీ ఇస్తున్నట్టే అని చెప్పారు. కాంగ్రెస్ నేతలు సరస్వతి, గణేష్ రాథోడ్.. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం మొదలుపెట్టగా... మరోవైపు బీజేపీ నేత కోట్నాక్ విజయ్ కూడా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో ఈ నియోజకవర్గంలో త్రిముఖ పోరు తప్పేట్టు లేదు... మూడు పార్టీల్లో ఆదివాసీలు ఏ పార్టీకి అండగా నిలుస్తాయో చూడాలి.

సిర్పూరు నియోజకవర్గం మహారాష్ట్ర సరిహద్దులో ఉంది. ఈ నియోజకవర్గంలో రాజకీయాలు సిర్పూర్ పేపర్ మిల్స్ చుట్టూ తిరుగుతాయి. ఇక్కడ లక్షన్నర ఓట్లు ఉన్నాయి. 2014 ఎన్నికల్లో ఇక్కడ బీఎస్పీ అభ్యర్థి కోనేరు కోనప్ప గెలిచారు. 2014 ఎన్నికల్లో కోనేరు కోనప్పకు 49,033 ఓట్లు వచ్చాయి. టీఆర్ఎస్ అభ్యర్థి కావేటి సమ్మయ్య 40,196 ఓట్లుకు మాత్రమే వచ్చాయి. దీంతో 8,837 ఓట్ల మెజార్టీతో కోనప్ప గెలిచారు. అయితే.. 2018 ఎన్నికల్లో.. టీఆర్ఎస్ తరపున పోటీ చేశారు కోనేరు కోనప్ప. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి హరీష్ బాబాబుపై విజయం సాధించారు. పాల్వాయి హరీష్‌బాబుకు 59,052 ఓట్లురాగా.. కోనేరు కోనప్ప 83,088 ఓట్లు సాధించారు. అంటే 24,036 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు కోనప్ప. అంతేకాదు ఈ నియోజకవర్గం నుంచి అత్యధిక సార్లు గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు. 2023 ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ నుంచి టికెట్ దక్కించుకుని నాలుగోసారి విజయం సాధించాలని పట్టుదలతో ఉన్నారు కోనప్ప. ఇక్కడ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోటీ ఉంటుంది.

# త్రిముఖ పోటీలో ఎల్బీ నగర్



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణ కాంగ్రెస్ లోకి చేరికలు పెరిగాయి. ఈ క్రమంలోనే? ఎల్బీ నగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేత ముద్దగోని రామ్మోహన్ గౌడ్ హస్తం కండువా కప్పేసుకున్నారు. దీంతో ఎల్బీ నగర్ రాజకీయం ఆసక్తికరంగా మారింది. అధికారికంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల యుద్ధం మొదలైపోయింది. ఎన్నికల షెడ్యూల్ రావటంతో?. ఇప్పటికే ప్రధాన పార్టీలు... వ్యూహాలు, ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. పోటీలో నిలిచి గెలిచే వారి జాబితాను కూడా రెడీ చేసుకునే పనిలో పడ్డాయి. కీలకమైన స్థానాల విషయంపై కూడా మేథోమథనం చేస్తున్నాయి. ప్రత్యర్థిని ఢీకొట్టే దిశగా అడుగులు వేస్తున్నాయి. బీఆర్ఎస్ జాబితా విడుదల కాగా? ఇప్పుడు అందరి చూపు కాంగ్రెస్ వైపు మళ్లింది. అభ్యర్థుల ఎంపికపై లోతుగా కసరత్తు చేస్తున్న కాంగ్రెస్ అధినాయకత్వం? ఆచితూచీ అడుగులు వేస్తోంది. ఓవైపు ఆపరేషన్ ఆకర్ష్ తో కీలక నేతలను తమవైపు తిప్పుకుంటోంది. ఈ నేపథ్యంలోనే?. ఎల్బీ నగర్ నియోజకవర్గంలో కీలక నేతగా ఉన్న ముద్దగోని రామ్మోహన్ గౌడ్ ను పార్టీలోకి రప్పించింది. దీంతో ఎల్బీ నగర్ రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఎల్బీ నగర్ నియోజకవర్గం?. ఇది ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉంది. 2014 నుంచి ఇక్కడి రాజకీయాలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఇక్కడ అనూహ్యంగా తెలుగుదేశం పార్టీ తరపున ఆర్ కృష్ణయ్య గెలిచారు. బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన ముద్దగోని రాంమోహన్ గౌడ్ ఓటమిపాలయ్యారు. ఇక 2018 ఎన్నికల్లో ఫలితాలు తారుమారు అయ్యాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన దేవిరెడ్డి సుధీర్ రెడ్డి విజయం సాధించారు. బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న ముద్దగోని రాంమోహన్ గౌడ్ ఓడిపోయారు. అయితే కొద్దిరోజులకే సుధీర్ రెడ్డి కూడా కారెక్కారు. ఫలితంగా కాంగ్రెస్ పరిస్థితి అయోమయంగా మారింది. నడిపించే నాయకుడే పార్టీ మారటంతో?. డైలామా పరిస్థితి నెలకొంది. సుధీర్ రెడ్డి పార్టీ మార్పు తర్వాత? ఇక్కడ మల్ రెడ్డి రంగారెడ్డి సోదరుడు మల్ రెడ్డి రాంరెడ్డి పార్టీ వ్యవహారాలను చూస్తున్నారు. ఇయనే కాకుండా? స్థానిక నేతగా పేరున్న స్థానిక నేతగా పేరున్న జక్కిడి ప్రభాకర్ రెడ్డి యాక్టివ్ గా పని చేస్తున్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. ఈసారి టికెట్ తమదే అన్న ధీమాలో ఇద్దరు నేతలు కూడా ఉన్నారు. అయితే అనూహ్యంగా పార్టీకి చెందిన సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్?. ఎంట్రీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఎల్బీ నగర్ టికెట్ ఇవ్వాలని గాంధీ భవన్ లో దరఖాస్తు చేసుకున్నారు. ఆ దిశగా గట్టిగా ప్రయత్నాలు చేస్తుండటంతో పాటు?. పాలు కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. మరోవైపు యాష్కీకి టికెట్ ఇవ్వొద్దంటూ మొదట్నుంచి పని చేస్తున్న మల్ రెడ్డి రంగారెడ్డితో పాటు జక్కి?డి ప్రభాకర్ రెడ్డి కోరుతున్నారు. ఇప్పటికే టికెట్ విషయంలో డైలామా నెలకొన్న నేపథ్యంలో?. ముద్దగోని చేరిక ఆసక్తికరంగా మారింది. ఇదే నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరపున రెండు సార్లు పోటీ చేసిన ఆయన?. సెకండ్ ప్లేస్ లో నిలిచారు. భారీగా ఓట్లను సాధించారు. అయితే ఈసారి టికెట్ రాకపోవటంతో అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయన? తాజాగా కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలంపాటు పని చేసిన నేతగా ముద్దగోనికి ఉంది. అయితే అప్పటి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో ఉన్న విభేదాలతో పాటు పార్టీ టికెట్ దక్కకపోవటంతో బీఆర్ఎస్ లో చేరారు. ఇప్పుడు సుధీర్ రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న నేపథ్యంలో?.. మరోసారి ఆయన్ను ఢీకొట్టాలని రామ్మోహన్ గౌడ్ భావిస్తున్నారు. అందుకు అనుగుణంగానే? కాంగ్రెస్ లో చేరారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఆయన భార్య ముద్దగోని లక్ష్మీ ప్రసన్న గతంలో బీఆర్ఎస్ తరపున కార్పొరేటర్ గా గెలిచారు. అయితే భార్యభర్తలు ఇద్దరు కాంగ్రెస్ లో చేరటంతో? టికెట్ వీరి కుటుంబానికే దక్కే ఛాన్స్ ఉందనే వాదన బలంగా వినిపిస్తోంది. ఆ హామీతోనే పార్టీలోకి వచ్చారని తెలుస్తోంది. మధుయాష్కీ గౌడ్ ఎంట్రీనే నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా మారింది. ఫలితంగా కాంగ్రెస్ టికెట్ కోసం ఇక్కడ త్రిముఖ పోటీ నడుస్తోంది. సడన్ గా ముద్దగోని రాకతో? టికెట్ కోసం పోటీ పడుతున్న నేతల సంఖ్య నలుగురికి చేరింది. గతంలో నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసి గెలిచారు మధుయాష్కీ. అయితే ఇదే స్థానం నుంచి 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎంపీ అభ్యర్థి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అనంతరం కాస్త సైలెన్స్ గా ఉన్న మధుయాష్కీ? నిజామాబాద్ విషయంలో డైలామాలో పడిపోయారు.

## పొన్నాలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించాం



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

కాంగ్రెస్ పార్టీకి సారథ్యం వహించిన సీనియర్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య తో సమావేశం అయ్యాను. కేసిఆర్ ఆదేశాలతో ఆయన్ని బీ ఆర్ ఎస్ లోకి ఆహ్వానించామని మంత్రి కేటీఆర్ అన్నారు. జనగామ సభలో చేరాలని చెప్పాం. కేసిఆర్ తో సమావేశమై తన నిర్ణయం చెబుతామని అన్నారు. ఆయన పార్టీలోకి వస్తె సముచిత స్థానం కల్పిస్తాం. కేకే, డీఎస్ లాంటి వాళ్లకు పార్టీలో పదవులు ఇచ్చింది గౌరవించాం. పెద్ద నాయకుడు, సీనియర్ నాయకుడు అ .చూడకుండా కాంగ్రెస్ పార్టీ అవమానంగా మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఎన్ని పార్టీలు మారలేదు. ఆయన పార్టీ లు మారొచ్చు కానీ ఇతరులు గౌరవం లేకపోతే మారొద్దా. దిగజారుడు సంస్కృతి మంచిది కాదు. సచ్చే ముందు పార్టీ మారటం ఏంటని మాట్లాడుతున్న నేతలు చిల్లరగా మాట్లాదుతున్నరు. ఓటుకు నోటు కు దొంగ ను పిసిసి కుర్చీ లో కూర్చోబెట్టారు. పొన్నాల కు మా పార్టీ న్యాయం చేస్తుందని అన్నారు.

### ఆడబిడ్డల ఆత్మీయ సంగమం బతుకమ్మ పండుగ

## ఆడబిడ్డలందరికీ ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో ఘనంగా జరుపుకొనే పండుగ సందర్భంగా ఆడబిడ్డలందరికీ ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. మన ఆడబిడ్డల ఆత్మీయ సంగమం, తెలంగాణ ఆత్మగౌరవ సంబరం బతుకమ్మ అన్నారు. ఈ నేపథ్యంలో భారత జాగృతి రూపొందించిన బతుకమ్మ పాటల ఆల్బమ్‌ను కవిత విడుదల చేశారు. మొత్తం 10 పాటలున్న ఈ ఆల్బన్ యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచారు. ఇందులో ఒక పాటకు ఎమ్మెల్సీ కవిత కోరస్ ఇవ్వడం విశేషం.

## కాంగ్రెస్ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

జగిత్యాల - ప్రభాత సూర్యుడు



జగిత్యాల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మున్నూరు కాపుల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ స్థానిక తహసిల్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత జనాభా ఉన్న మున్నూరు కాపు నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజకీయ పార్టీలను రాబోయే ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించి మున్నురుకపుల సత్తా ఏంటో చూపిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్నూరు కాపు నాయకులు సమిండ్ల శ్రీనివాస్, ముసిపట్ల లక్ష్మీనారాయణ, రవి, సమిండ్లా రాజేష్, కొలగని సత్యనారాయన, కూతురు శేఖర్, ఉప్పు కిషన్, నీలి లింగయ్య, నరేష్, గదే కార్తిక్, తోట ప్రభు, కొమ్మెర మధుకర్, రాజు, చిట్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు బస్సు, స్కూలు వ్యాన్ ఢీ

### - విద్యార్థులు సురక్షితం

పాలకొల్లు -ప్రభాత సూర్యుడు : పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు లోని శ్రీరామ్ స్కూల్ బస్సును హైదరాబాద్ ఆరంజ్ ట్రావెల్స్ ప్రైవేట్ బస్సు వెనకనుంచి ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం తప్పింది. పూలపల్లి వద్ద జరిగిన ఈ ప్రమాదంలో స్కూలు బస్సులో 42 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. అయితే ప్రమాదంలో విద్యార్థులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ కు గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## పొన్నాల లక్ష్మయ్యను కలిసిన మంత్రి కేటీఆర్

### - కనకపు సింహాసనంపై ఓటుకు నోటు దొంగను కూర్చోబెట్టారని వ్యాఖ్య

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యను బీఆర్ఎస్ పార్టీలోకి రావాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆహ్వానించారు. ఇవాళ మధ్యాహ్నం పొన్నాల ఇంటికి మంత్రి కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శానంపూడి సైదిరెడ్డి, సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్ వెళ్లారు. నిన్న కాంగ్రెస్ పార్టీకి పొన్నాల లక్ష్మయ్య రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పొన్నాల లక్ష్మయ్యను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించేందుకు వచ్చానని తెలిపారు. సీఎం కేసీఆర్ సూచన మేరకే పొన్నాల ఇంటికి వచ్చానని పేర్కొన్నారు. పార్టీలో చేరేందుకు పొన్నాల సుముఖత వ్యక్తం చేశారు. ఆయనకు బీఆర్ఎస్‌లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రేపు పొన్నాల సీఎం కేసీఆర్‌ను కలుస్తారు. సీఎంను కలిసిన తర్వాత పొన్నాల తుది నిర్ణయం ప్రకటిస్తారని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి పొన్నాల ఎంతో సేవ చేశారని మంత్రి గుర్తు చేశారు. సీనియర్లకు కాంగ్రెస్ పార్టీలో కనీసం గౌరవం లేకుండా ఇవ్వడం లేదు. పొన్నాలను రేవంత్ తూలనాడిన విధానం హీనసంస్కారానికి నిదర్శనం. కనకపు సింహాసనంపై ఓటుకు నోటు దొంగను కూర్చోబెట్టారు అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.

## రాజేంద్రనగర్‌లో రౌడీ షీటర్ దారుణ హత్య

రంగారెడ్డి -ప్రభాత సూర్యుడు



రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లో రౌడీ షీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. డైరీ ఫామ్ వద్ద ఓ నిర్మానుష్య ప్రాంతం లో రౌడీ షీటర్ సర్వర్ ను దుండగులు హత్య చేసారు. పథకం ప్రకారం సర్వర్ ను నిర్మానుష్యమైన ప్రాంతానికి తీసుకొని వెళ్లి కత్తులతో పొడిచి చంపినట్లు పోలీసులు గుర్తించారు. పాత కక్షల నేపథ్యంలో సర్వర్ ను దుండగులు చంపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు సంఘటనాస్థలానికి చేరుకున్నాయి.

# మన చేతుల్లోనే దాగి ఉన్న ఆరోగ్యం

### - ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



చేతుల అపరిశుభ్రత ప్రాణాల మీద తెస్తుందని, డయేరియా, న్యూమోనియా లాంటి వ్యాధులతో ఎంతోమంది చిన్నారులు కన్నుమూస్తున్నారని, సరైన అవగాహన చైతన్యం లేకపోవడం వల్ల, తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదని, చిన్న చిన్న జాగ్రత్తలతో వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకునే విసులుబాటు ఉన్నప్పటికీ నిర్లక్ష్యము కారణంగా పరిస్థితిని చేజారి పోతుందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ అన్నారు. అన్నం తినబోయే ముందు, మరుగుదొడ్లు వాడిని అనంతరము, బయటనుంచి ఇంట్లోకి వచ్చిన తర్వాత, చేతుల శుభ్రత విషయంలో నిర్లక్ష్యము చేస్తున్నారని, దీనివల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, రకరకాల ప్రమాదకర వ్యాధులను కేవలం చేతులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దూరంగా పెట్టవచ్చు అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ అన్నారు. ఈ సందర్భంగా లిల్లీ మేరీ మాట్లాడుతూ ఈ అలవాటును పాటించడం ద్వారా ఏటా 50 లక్షల మరణాలు తగ్గించవచ్చు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందని, అందరూ చేతిశుభ్రత పై



అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని ఆదివారం ప్రపంచ చేతి శుభ్రత దినోత్సవ సందర్భంగా భిన్న అంశాలతో ప్రత్యేక కథనం.

**చిన్నపిల్లలతో తస్మాత్ జాగ్రత్త:** పిల్లల్లో న్యూమోనియా, ఇతర శ్వాసకోశ వ్యాధులకు ప్రధాన కారణం శుభ్రత పాటించకపోవడం, నెలలు నిండని శిశువులు, అప్పుడే పుట్టిన పిల్లలను తాకేముందు తల్లిదండ్రులు ఇతరులు తప్పనిసరిగా శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా చేతులను సబ్బుతో కడుక్కున తర్వాతే శిశువులను తాకాలి. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, అవయవ మార్పిడి చేసుకున్న వారిలో మిగతా వారితో పోలిస్తే వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటివారు శుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తే తేలికగా వ్యాధులు దాడి చేసేందుకు అవకాశం ఇచ్చినట్టే. చేతులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా 25% వరకు న్యూమోనియా ఇతర శ్వాసకోశ వ్యాధులను నివారించవచ్చని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ పేర్కొన్నారు.

**ఆషామాషీగా వద్దు:** అత్యధికులు చేతి శుభ్రతను ఆషామాషీగా తీసుకుంటున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. కేవలం నీటితో కాకుండా సబ్బు, లేదంటే యాంటీ బ్యాక్టీరియల్ లోషన్ ఉపయోగించాలని సూచిస్తున్నారు. నగరంలో 100% ఇళ్లలో సబ్బు వినియోగంలో ఉంది. స్నానానికి, దుస్తులు ఉతకడానికి, వంటపాత్రలో కడగటానికి వాడుతున్నారు. పాత్రలు కడగటానికి సాధారణంగా 30% కంటే తక్కువ మంది మాత్రమే చేతులను కడుక్కునేందుకు సబ్బు లేదా యాంటీ బ్యాక్టీరియాల్ ఉత్పత్తులు వాడుతున్నారని లిల్లీ మేరీ అన్నారు. మరుగుదొడ్లు ఉపయోగించాక సబ్బుతో చేయి కడుక్కొని ఫలితంగా వైరల్ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ గురవుతున్నారని, ఒకరికి సోకితే మిగతా కుటుంబ సభ్యులకు అది వ్యాపిస్తుందని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ పేర్కొన్నారు.

**వ్యాధులకు హేతువు:** మన చెయ్యి ఎన్నో బ్యాక్టీరియా, వైరస్లకు నిలయం. నిత్యం ఏదో ఒక పనిలో నిమగ్నమవు తుంటాము. రకరకాల వస్తువులను తాకు తుంటాము. మరుగుదొడ్లను వినియోగిస్తుంటాము. ఈ క్రమంలో అనేక రకాల బ్యాక్టీరియా, వైరస్లు, చేతి వేళ్ళ, ముంచేయి గోళ్ళలో, నివాసమును ఏర్పాటు చేసుకుంటాయి. ఎప్పటికప్పుడు సబ్బు లేదా యాంటీ బ్యాక్టీరియాలోషన్ తో శుభ్రం చేసుకోవాలి. అలా కాకుండా అవే చేతులతో నోరు, కళ్ళు, ముక్కు, పెదవులను తాకటం వల్ల వ్యాధుల సోకే ప్రమాదం ఉంది. ప్రధానంగా వ్యక్తిగత శుభ్రత పాటించనందునే డయేరియా, న్యూమోనియా, టైఫాయిడ్ కలరా స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు నగరంలో పెరుగుతున్నాయి. వైరస్ బ్యాక్టీరియా క్రిములు ఇనీదుకు కారకాలు. ఒకరి నుంచి వేరొకరికి వేగంగా ఇవి విస్తరిస్తాయి. స్వైన్ ఫ్లూ తో బాధపడే వారు తుమ్మి నా, దగిన ఆ వైరస్ సమీపంలో ఉండే వస్తువుల పైకి చేరుతుంది. అక్కడ చేతులు వేసిన సమయంలో శరీరంలోకి చేరుతుంది. ఇక ఆహారం తినడానికి ముందు, వడ్డించేటప్పుడు, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. లేదంటే చేతిలో వైరస్ ఉంటే ఆహార పదార్థాల మీద వ్యాపించిం, అతిసారము లాంటి అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది.

**ఇవి వాడాలి:** ఈ సందర్భంగా లిల్లీ మేరీ మాట్లాడుతూ చేతుల శుభ్రతకు నీళ్లు, సబ్బు, శానిటైజర్ల వాడకంతో బ్యాక్టీరియా క్రిములను 60 శాతం వరకు తొలగించే అవకాశం ఉంది. అలాగే రసాయనాలు ఎక్కువగా లేని సభ్యులు వినియోగించి చేతులు కడుక్కోవడం మంచిది. సున్నిపిండి, పసుపు, వేడి నీళ్లు, నిమ్మకాయ రసం మిశ్రమము, కలబంద, తేయాకు, పొద్దుతిరుగుడు నూనెలతో తయారైన శానిటైజర్లు వాడితే చాలా మంచిదని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ తెలిపారు.

## ఓయూ లో ఏబీవీపీ నాయకుల నిరసన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఉస్మానియా యూనివర్సిటీలో ప్రవల్లిక ఆత్మహత్య కు నిరసనగా ఓయూ ఏబీవీపీ నాయకులు కార్ టైర్ ను కాల్చి నిరసన వ్యక్తం చేశారు. నిరసన తెలియచేస్తున్న ఏబీవీపీ నాయకులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసీఆర్ ను ఫామ్ హౌస్ కు తరిమి కొడతాం అంటూ మండిపడ్డారు.

### హయత్ నగర్‌లో సడక్ బంద్ తోపులాటలో

## పోలీసు కానిస్టేబుల్ కు గాయాలు

రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు

హయత్ నగర్ వద్ద విజయవాడ జాతీయ రహదారి పై ఉద్రిక్తత నెలకొంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బోర్డు రద్దు చేసి నూతన బోర్డు ఏర్పాటు చేయాలని సడక్ బంద్ నిర్వహించారు. సడక్ బంద్ లో వామపక్ష నేతలు పాల్గోన్నారు. ఒక్కసారి రోడ్డు పైకి ఆందోళనాకారులు వచ్చారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు ఆందోళనకారుల మద్య తోపులాట జరిగింది. తోపులాటలో ఒక కానిస్టేబుల్ డిసిఎం కింద పడ్డాడరు. కానిస్టేబుల్ సతిష్ కు తీవ్రగాయాలు కావడంతో హాస్పిటల్ కు తరలించారు.

## ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్ డ్రైవర్ చాకచక్యంలో ప్రయాణికులుక్షేమం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

బస్సు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా ప్రయాణికుల ప్రాణాలకు ముక్కు వాటిల్లకుండా బస్సును అదుపు చేసి ప్రయాణికులను క్షేమంగా రోడ్డు పక్కకు చేర్చాడు. ఈ సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేబీఆర్ పార్కు దగ్గర కోటి నుండి పటాన్చెరువు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిలయ్యాయి. డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. ప్రయాణికులేవరికి హాని కలకుండా పార్కు సైడు ఉన్న ఫుట్ పాత్ పైకెక్కించి బస్సును ఆపాడు. ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ఆ సమయంలో బస్సులో సుమారుగా 45 మంది ప్రయాణికులు ఉన్నట్లు బస్సు డ్రైవర్ వెంకటేష్ గౌడ్ తెలిపాడు. ఎవరికి గాయాలు కాకుండా ప్రాణహాని లేకుండా బస్సు ను నడిపినందుకు డ్రైవర్ వెంకటేష్ గౌడ్ సమయస్ఫూర్తిని పలువురు ప్రయాణికులు అభినందించారు.

## పొన్నాల రాజీనామా కాంగ్రెస్ పార్టీకి నష్టమే

### వి.హెచ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ మాజీ ఛీఫ్ పొన్నాల లక్ష్మయ్య పార్టీకి రాజీనామా చేయడం పై ఆ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు స్పందించారు. . పొన్నాల లక్ష్మయ్యను అవమానించారు కాబట్టే రాజీనామా చేశారని విహెచ్ అన్నారు. పొన్నాలను బాధ పెట్టారు. అయనకు జనగామలో ఇబ్బందులు పెట్టారిని అయన ఆరోపించారు. తన గోడును ఎన్నోసార్లు పీసీసీకి చెప్పుకున్నారని అన్నారు. పొన్నాల రాజీనామా కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా నష్టాన్నే కలిగిస్తుందని వీహెచ్ అన్నారు.

## ప్రవళిక మరణం ప్రభుత్వ హత్యే

### - నిరుద్యోగ యువత ప్రాణాలతో చెలగాటమాడుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వం
### - కేసిఆర్ దిష్టి బొమ్మ దగ్ధం చేసిన కాంగ్రెస్ నాయకులు
### - ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ప్రవలిక మరణం
### - మర్రి ప్రవళిక మరణం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

నెక్కొండ - ప్రభాత సూర్యుడు : స్థానిక అంబేద్కర్ సంటర్లో శుక్రవారం ఉద్యోగం రాలేదని మనస్థాపానికి గురై ప్రవలికా మరణించగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని నిరసనతెలిపిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అనంతరం మాట్లాడుతూ టీఎస్పీఎస్సీ నోటిఫికేషన్ రద్దు కారణంగా మనస్థాపానికి గురైన నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి మండలం బిక్కజిపల్లి గ్రామానికి చెందిన మర్రి ప్రవలిక ఆత్మహత్యను ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని నెక్కొండ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీష్ రెడ్డి పట్టణ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ జిల్లా కార్యదర్శి రాచకొండ రఘు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి శివకుమార్ మండల నాయకులు కుసుమ చెన్నకేశవులు ఈదునూరి సాయికృష్ణ అన్నారు. అనంతరం బక్కి అశోక్ మాట్లాడుతూ నోటిఫికేషన్ల రద్దు పేరుతో పేపర్ లీకేజీల పేరుతో నిరుద్యోగ యువతను దారుణంగా మోసం చేస్తున్న ఈ అధికార పార్టీనీ తెలంగాణ రాష్ట్రం తరిమికొట్టాలి అన్నారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే యువకులందరికీ ఉద్యోగాలు వస్తాయని కొంతమంది విద్యార్థులు బలిదానాలు చేసుకొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ దొంగల ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకపోగా వారి ప్రాణాలు తీసుకునే స్థాయికి ఈ ప్రభుత్వం దిగజారింది అన్నారు వచ్చిన తెలంగాణలో ఇచ్చిందేమీ లేదన్నారు హామీలు తప్ప ఏవి అమలు కాలేదు అన్నారు ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రావుల మైపాల్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు సింగం ప్రశాంత్ మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు ఈదునూరి దిలీప్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల కిష్టయ్య బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సముద్రాల కనకయ్య ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎడంపాక ప్రకాశం ఎన్ఎస్యుఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ శ్రీకాంత్ అలంకానిపేట గ్రామ పార్టీ అధ్యక్షులు రాంపల్లి శ్రవణ్ బానోతు శ్రీకాంత్ ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు భూక్య శరత్ అబ్బదాసి గౌతమ్ ఈదునూరి శివాజీ మోతే విక్కి చిన్నూరి కార్తీక్ కొంగర దినేష్ పిట్టల రాజ్ కుమార్ కొమ్ము దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215